నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 24 మే 2024 | KHAMMAM

ఆటోనేస్తం..

ఆకలిరాజ్యం

సాప్ ఆటో ఎటూ లేదు..

'సాపాటు ఎటూ లేదు.. పాటైనా పాడు బ్రదర్.. రాజధాని నగరంలో వీధీ వీధీ నీదీ నాదే బ్రదరూ..' అన్నారు 1980లో వచ్చిన 'ఆకలి రాజ్యం' సినిమాలో ఆచార్య ఆత్రేయ. ఆనాడు ఆయన రాసిన ఈ గీతం 2024లో ఆటోవాలాల బతుకుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన సంక్షోభానికి సరిగ్గా సరిపోతుందని బహుశా ఆయన ఊహించి కూడా ఉండరు. అయినా ఆయన చెప్పిన మాటలు ఆనాడు నిరుద్యోగుల జీవితాలకు, ఈనాడు ఆటో కార్మికుల జీవనగాథకు అద్దం పడుతున్నాయి.

- ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మే 23

'వీధీ వీధీ నీదీ నాదే బ్రదరూ'

అని తిరిగినా పైసా కిరాయిలేదు

'ఆకలి రాజ్యాన్ని' మరిపిస్తున్న ఆటోవాలాల జీవనగాథ

'మహాలక్ష్మి' పథకం.. ఆటో కార్మికుల బతుకులకు శాపం

నేడు ఎంతగా ఎదురుచూసినా ఏ ఒక్కరూ ఎక్కక కటకట

ఒకవైపు ఆటో కిస్తీలు.. అవి కట్టేందుకు మరోవైపు గిరిగిరి అప్పులు

ఆటో డ్రైవర్ల జీవితం.. సగటు కూలీకంటే దయనీయం

ఎన్నికలప్పుడు రూ.15 వేల భృతి అన్నారు.. గెలిచాక మరిచారు

ఆటోలు అమ్ముకునే పరిస్థితి

మహిళలందరూ ఉచిత బస్సు ప్రయాణం చేస్తుండడంతో ఆటో ఎక్కేవారు కరువయ్యారు. గతంలో రోజుకు కనీసం రూ.వెయ్యి సంపాదించడంతో కుటుంబ పోషణతోపాటు వచ్చిన దాంట్లో పిల్లలను చదివించుకునేవాళ్లం. ఇప్పుడు ఆటో ఎక్కేవారు లేకపోవడంతో ఫైనాన్స్‌లు కట్టలేక ఆటోలు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు సౌకర్యంతో మా బతుకులు ఆగమవుతున్నాయి. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

– బాలూనాయక్, కారేపల్లి క్రాస్‌రోడ్, సింగరేణి మండలం

కిరాయిలు లేకపోవడంతో రఘునాథపాలెం ఆటో అడ్డాలో అష్టా-చమ్మా ఆడుకుంటున్న ఆటో డ్రైవర్లు

అడ్డాల్లోనే ఖాళీగా ఉంటున్నం

ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఫ్రీ బస్సులు పెట్టకముందు మా అడ్డా ఆటోలకు కిరాయిలు మస్తుగ ఉండేవి. మహిళలు ఎక్కువగా ఆటోలనే ఎక్కడంతో గిరాకీ బాగుండేది. ప్రభుత్వం ఉచిత బస్సు అన్నప్పటి నుంచి ఆటోల్లో ఎక్కేవాళ్లు లేక అడ్డాల్లోనే ఖాళీగా కూర్చుంటున్నం. ప్రయాణికుల కోసం గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో రోజుకు రూ.వెయ్యి కిరాయి తోలేవాణ్ణి. ఇప్పుడు రూ.వందలు కూడా సరిగ్గా రావట్లేదు.

– పందుల పాపారావు, ఆటో డ్రైవర్, రఘునాథపాలెం

అతడు ఒక వేద ముస్లిం. పేరు సయ్యద్ ముజీద్. కొత్తగూడెం హనుమాన్ బస్తీ. బతుకుభారాన్ని మోసేందుకు, కుటుంబాన్ని పోషించుకునేందుకు రెండేళ్ల క్రితం రూ.2,40,000 ఫైనాన్స్‌తో ఆటో కొనుగోలు చేశాడు. ముందుగా తన వాటాగా రూ.40 వేలు చెల్లించినప్పటికీ అసలూ, వడ్డీ కలిపి అప్పు తీరే నాటికి మరో రూ.లక్ష అదనమయ్యేది. రోజంతా కష్టపడి ఆటో తోలుతానని, కిస్తీలు పోగా కుటుంబ పోషణ కోసం సాయంత్రానికి చేతినిండా ఆదాయం తీసుకెళ్తానని బలంగా నమ్మాడు. ఏడాదిన్నరగా అంతే నమ్మకంతో పనిచేస్తున్నాడు. జీవితం అతడు బలంగా నమ్మినట్లుగానే సాగింది. కానీ.. సరిగ్గా ఆరు నెలల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని తెచ్చింది. ముజీద్ బలమైన నమ్మకాన్ని బలహీనం చేసింది. ఇప్పుడతను నెలకు రూ.8,350 కిస్తీ కట్టాలి. డీజిల్ ఖర్చుపోగా సాయంత్రానికి ఇంట్లోకి సరుకులు తీసుకెళ్లాలి. పిల్లల ఫీజులు, ఆరోగ్య ఖర్చులు ఇతరత్రాలు కట్టాలి. కానీ.. రోజుకు రూ.200 కూడా దాటని నేటి ఆదాయానికి ఇవన్నీ అసాధ్యమయ్యాయి. కానీ వృత్తిని వదులుకోలేక, అవయవం లాంటి ఆటోను వదులుకోలేక సతమతమయ్యాడు. ఎలాగైనా ఆటోను కాపాడుకోవాలన్న సంకల్పంతో చివరికి ఒక గిరిగిరి వ్యాపారి వద్ద మరో అప్పు తీసుకున్నాడు. తోలినా తోలకున్నా రోజూ సాయంత్రానికి అతడికి అప్పు చెల్లిస్తున్నాడు. 'ఇక ఫీజులు నేను కట్టలేను తల్లీ..' అంటూ నచ్చజెప్పుకొని తన కుమార్తెను ప్రభుత్వ కాలేజీలో చేర్పించాడు.

నాడు కిటకిట.. నేడు కటకట

సరిగ్గా ఆరు నెలలకు ముందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులతో కిటకిటలాడిన ఆటోలు.. నేడు అవే వేళలో ఎవరూ ఎక్కక వెలవెలబోతున్నాయి. ఫలితంగా ఆటో కార్మికుల బతుకులు కటకటలాడుతున్నాయి. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఏకైక దుర్బుద్ధితో ఎడాపెడా ఇచ్చిన హామీల్లో భాగంగా ముందూవెనుకా చేయని ఆలోచన ఫలితంగా తెచ్చిన 'మహాలక్ష్మి' పథకం మహిళలను సంతృప్తి పరిచిందోలేదోగానీ ఆటో రిక్షా తోలకాన్నే వృత్తిగా ఎంచుకొని కుటుంబాలను పోషించుకుంటున్న వేలాది ఆటో కార్మికుల జీవితాలను ఒక్కదెబ్బకే ఛిద్రం చేసింది. ఫలితంగా వారి జీవితం.. సగటు రైతు కూలీకంటే దయనీయమైంది. 'పిలిస్తే పలికే నేస్తాన్ని.. మీ చెంతనే ఉండే ఆటో డ్రైవర్‌ని' గర్వంగా చెప్పుకునే ఆటోవాలాల గౌరవం గంగపాలైంది.

కిస్తీలు కట్టేందుకు గిరిగిరి అప్పులు

ఆటో తోలకాన్నే వృత్తిగా ఎంచుకున్న కొందరు.. దానిని అంతే గౌరవంగా భావించారు. ఎంతోమంది ఆటో కార్మికులు కేవలం తాము ఆటో తోలగా వచ్చిన ఆదాయంతోనే ఏ లోటూ లేకుండా కుటుంబాన్ని పోషించునేవారు. మరెంతోమంది ఆటోవాలాలు పైసాపైసా కూడబెట్టి పిల్లలను ఉన్నత చదువులు చదివించేవారు. అవసరమైతే పస్తులుండి మరీ పిల్లలకు ఘనంగా వివాహాలు జరిపించేవారు. ఇలాంటి దృశ్యాలు మన ఇరుగుపొరుగున కూడా ఎన్నో సాక్షాత్కరించేవి. వారంతా ఉన్న నగదంతా వెచ్చించి ఆటోను కొనుగోలు చేసిన వాళ్లేం కాదు. చేతిలో చల్లిగవ్వ లేకున్నా ఫైనాన్స్‌లో ఆటో తెచ్చుకొని మరీ తోలుకునేవారు. ఇటు కిస్తీలు కడుతూనే.. అటు ఏ లోటూ రాకుండా కుటుంబాన్ని పోషించుకునే వారు. కానీ 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం' అంటూ కాంగ్రెస్ తెచ్చిన పథకంతో కనీసం కిస్తీలు కట్టుకునేంత ఆదాయం కూడా నేడు ఆటోవాలాలకు రావడం లేదంటే అతిశయోక్తి కాదు. చివరికి కిస్తీ కట్టకపోతే తన ఆటోను ఫైనాన్స్ వాళ్లు తీసుకెళ్తారేమోనని, అదే జరిగితే ఇప్పటికే రోడ్డున పడిన తన కుటుంబం ఇకపై అగాధంలోకి వెళ్తుందని ఆటోవాలాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆటోను కాపాడుకునేందుకు, ఎలాగైనా కుటుంబాన్ని పోషించుకునేందుకు చివరికి గిరిగిరి అప్పులు చేసి మరీ కిస్తీలు చెల్లిస్తున్నారు. ఆటోవాలాలకు నెలకు రూ.15 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికలప్పుడు బాకాలూదిన కాంగ్రెస్ పాలకులు.. తీరా గెలిచాక ఆ ఊసే మరిచారు. ఆటోవాలాలకు మరణశాసనాన్ని మిగిల్చారు. ఆటోవాలాల ఆత్మహత్యలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం.

నాడు రూ.1000.. నేడు రూ.200

ఖమ్మం జిల్లాలో సుమారు 30 వేలకు పైగా ఆటోలున్నాయి. వాటిపై దాదాపు 40 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ ఆటో కార్మికులందరూ ఆరు నెలల క్రితం వరకూ ఆటో తోలుకొని రోజుకు రూ.1000 వరకూ ఆదాయాన్ని సమకూర్చుకునే వారు. కానీ 'మహాలక్ష్మి' పుణ్యమా అని నేడు రోజంతా ఎదురుచూసి తోలినా రూ.200 దాటితే గగనం. ఈ మొత్తంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఆరోగ్య ఖర్చులు సహా ఇత్యాది అవసరాలు వెళ్లదీయడం వారి కష్టానికి మించిన భారం. మరి ఈ నేరం.. కాంగ్రెస్ పాలకులది కాదంటే పాపం.

ఈ ప్రభుత్వం మా బతుకులపై దెబ్బ కొట్టింది..

ఎన్నో ఏళ్లుగా ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని బతికించుకుంటున్నా. ఆకలిదప్పులు లేకుండా ఇన్నాళ్లూ ఎంతో గౌరవంగా బతికా. కానీ.. ఇప్పుడు 'ఫ్రీ బస్' వచ్చాక ఆటో ఎక్కేవాళ్లు తక్కువయ్యారు. ఉదయమే బండి తీసి అడ్డాలో పెట్టినా ఎక్కే వాళ్లే రావట్లేదు. మహిళలందరూ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు ఎక్కి వెళ్తున్నారు. మధ్యాహ్నమైనా పట్టుమని పది మంది కూడా ఎక్కే పరిస్థితి లేదు. చివరికి ఆకలేస్తే ఇంటికెళ్లాల్సిన పరిస్థితి. మా బతుకులు మరింత దారుణమయ్యాయి. కూలికి వెళ్లేవాళ్లకైనా సాయంత్రానికి కూలి డబ్బులు చేతికి వస్తాయి. కానీ.. ఇప్పుడు మా దుస్థితి అంతకంటే దయనీయమైంది. అప్పు చేసి మరీ కొనుక్కున్న ఆటోను ఎప్పుడు ఫైనాన్స్ వాళ్లు తీసుకెళ్తారోనన్న భయం వెంటాడుతోంది. 'ఫ్రీ బస్' తెచ్చిన ఈ ప్రభుత్వం మా బతుకులపైనే దెబ్బకొట్టింది.

–జగన్నాథం, ఆటోడ్రైవర్, కొత్తగూడెం

మా బతుకులను బాగు చేయాలి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోవాలాల బతుకు ఆగమైంది. బస్సుల్లో ఎప్పుడూ లేనంతగా మహిళలు ప్రయాణం చేస్తుండడంతో అత్యవసరంగా వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రయాణించేందుకు చోటు లేకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఆటోల్లో ఎవరూ ప్రయాణించకపోవడంతో రోజుకు మూడు ట్రిప్పులు వేసే వాళ్లం.. ఇప్పుడు ఒక టిప్పు నడపడమే కష్టంగా మారింది. మా బతుకులను బాగు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– బాజీ, వీఎం బంజర, పెనుబల్లి మండలం

ఇల్లెందులో అడ్డా మీద ఉన్న ఆటోడ్రైవర్లు

ఇరవై రోజులు ఖాళీ జేబులే

ఉదయం 6 నుంచి రాత్రి వరకు మూడు షిఫ్టులు ఆటో నడుపుకుంటున్నా. ఇంత కష్టపడ్డా నెలలో 20 రోజులు మాత్రం జేబులు ఖాళీనే. ఇంటికి ఏ ముఖం పెట్టుకుని వెళ్లాలో అర్థం కావడం లేదు. ద్విచక్ర వాహనాలు కూడా ఎక్కువ కావడంతో వచ్చే పదో పరకో కూడా చేయి దాటిపోతోంది. ఇద్దరు పిల్లలతోపాటు వృద్ధ తల్లిదండ్రులను పోషించుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఎండీ.షఫీవుల్లా, ఆటోడ్రైవర్, చెరువుకట్ట 24 ఏరియా, ఇల్లెందు

బతుకులు ఆగమైనయ్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో ఆటో ఎక్కేవారు లేకపోవడంతో మా బతుకులు ఆగమైనయ్. రోజూ ఆటో నడిపితే రూ.వెయ్యి, రూ.1,200 వరకు సంపాదించే వాళ్లం. కుటుంబ పోషణ కూడా ఇబ్బంది లేకుండా ఉండేది. ప్రభుత్వం మాకు సాయం చేస్తామని చెప్పి ఇచ్చిన మాట తప్పింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఆత్మహత్యలే శరణ్యమయ్యే పరిస్థితి ఉంది.

– సున్నం నగేశ్, ఆటో డ్రైవర్, ములకలపల్లి మండలం

డీజిల్ ఖర్చు కూడా రాట్లే

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. దీని వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది. ఆటో నడిపితే రోజుకు రూ.600 నుంచి రూ.700 వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు డీజిల్ ఖర్చులు కూడా రావట్లేదు. ఇంకొన్ని రోజులైతే ఆటోలు అమ్ముకునే పరిస్థితి వస్తుంది. ఆటో డ్రైవర్ల జీవనోపాధి కోసం ఒక పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

– మల్లాది వెంకటేశ్, వీఎం బంజర, పెనుబల్లి మండలం

పిల్లలను చదివించాలంటే కష్టంగా మారింది

ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఒకరు డిగ్రీ, మరొకరు బీ ఫార్మసీ. వీరికి ఫీజులతోపాటు అనేక రకాల పుస్తకాలు కొనుగోలు చేస్తున్నా. దీంతోపాటు కుటుంబ పోషణ కూడా చేసుకోవాలి. వృద్ధులైన తల్లిదండ్రుల దవాఖాన ఖర్చులతోపాటు వారి ఆరోగ్యపరంగా కావాల్సిన ఆహార పోషక పదార్థాలను నేనే కొనాలి. అందరి బాధ్యత నా పైనే ఉంది. ఆటో గిరాకీ లేక ఇబ్బందిగా ఉంది. ఇక ముస్తుందు అమ్మాయిల పెళ్లి చేయాలంటేనే దడ పుట్టిస్తోంది.

– కొంపెల్లి పోశాలు, ఆటోడ్రైవర్, 21 ఏరియా, ఇల్లెందు మండలం

పిల్లల ఫీజులెట్లా కట్టాల్నో..

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పెట్టడంతో ఆటో కార్మికుల కుటుంబాలను వీధిన పడేసినట్లైంది. రోజూ గిరాకీ లేక ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఈ ఏడాది పాఠశాలల్లో పిల్లల ఫీజులెట్ల కట్టాల్నో తోచడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం దయతలిచి ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి. నెలకు రూ.12 వేలు ఆర్థిక సాయం చేయాలి. లేదంటే మాకు ఆత్మహత్యే శరణ్యం అవుతుంది.

– కడెం గోపి, ఆటో డ్రైవర్, రఘునాథపాలెం

నేడు హరీశ్‌రావు పర్యటన

సత్తుపల్లి, మధిర, పాలేరులో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాలు

ఖమ్మం, మే 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మూడు నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగే ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొననున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఉదయం 10.30 గంటలకు సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించి అక్కడ పట్టభద్రులతో జరిగే సమావేశంలో ప్రసంగిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మధిర, సాయంత్రం 5.30 గంటలకు పాలేరు నియోజకవర్గాల్లో పట్టభద్రులను కలిసి ప్రచారం చేస్తారని, ఆయా ప్రాంతాల్లో జరిగే సమావేశాల్లో మాట్లాడుతారని పేర్కొన్నారు. ఆయా సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

ఖమ్మం, మే 23 : నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార రథాలను(ఆటోలను) రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయం(తెలంగాణభవన్)లో ప్రచార రథాలను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ రాకేశ్‌రెడ్డికి ఘనవిజయం చేకూర్చేందుకు ఈ ప్రచార రథాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి రాకేశ్‌రెడ్డి

భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు

పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 23 : రైతుబిడ్డగా జన్మించిన రాకేశ్‌రెడ్డికి ప్రజల కష్టసుఖాలు తెలుసని, అటువంటి వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే నిత్యం సమస్యలపై పోరాడుతారని భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సమితిసింగారం పంచాయతీలోని అశోక్‌నగర్ గ్రామంలో పట్టభద్రులను కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లో వచ్చారని, ఆయనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. గోల్డ్ మెడలిస్ట్ కావాలా.. గోల్‌మాల్ మల్లన్న కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పగిడేరులో విస్తృతంగా ప్రచారం చేసిన జడ్పీటీసీ పోశం నర్సింహారావు.. మొదటి ప్రాధాన్యతా ఓటు రాకేశ్‌రెడ్డికి వేయాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, నాయకులు కుర్రి నాగేశ్వరరావు, రామసహాయం వెంకటరెడ్డి, కంభంపాటి శ్రీను, వీరపనేని చెన్నకేశవులు, బర్మావత్ నర్సింహులు, గాజుల నరేశ్, గంజి నరేందర్, సూత్రపు నాగభూషణం, సానికొమ్ము అనంతరామిరెడ్డి, పప్పుల ప్రసాద్, బేతమల్ల సుందర్, వేర్పుల నరేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయండి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ ఆర్జేసీ కృష్ణ



నగరంలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఆర్జేసీ కృష్ణ

ఖమ్మం, మే 23 : సమస్యల పరిష్కారం కోసం విద్యావంతుడైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంఛార్జ్ ఆర్జేసీ కృష్ణ కోరారు. రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఖమ్మం నగరంలోని స్ట్రీటాన్‌లో గల పలు డివిజన్ల పరిధిలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం చేసిన హామీని విస్మరించారని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే పెద్దల సభలో ప్రశ్నించే గొంతుకగా వ్యవహరిస్తూ.. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని వెల్లడించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టభద్రులు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, కన్నం ప్రసన్నకృష్ణ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 23 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యాన్ని నిర్ణీత తేమ శాతం(17) వచ్చేంత వరకు ఆరబెట్టుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీవో విద్యాచందన, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ త్రినాథ్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.